ong-5_ong-5.qxd 5/14/2026 9:34 PM Page 1



## ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్‌గా వెంకట కృష్ణయ్య బాధ్యతలు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా టి. వెంకట కృష్ణయ్య గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వెంకట కృష్ణయ్య జిల్లా కలెక్టర్ పి రాజబాబును, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరు, పెండింగ్ అభివృద్ధి కార్యక్రమాలు, నగర పారిశుధ్యం, పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలపై కమిషనర్ సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. నగరాభివృద్ధికి





ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు.టి. వెంకట కృష్ణయ్య గతంలో పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో అధికారిగా పనిచేసి పట్టణాభివృద్ధి రంగంలో విశేష అనుభవాన్ని సంపాదించారు. పట్టణ ప్రణాళిక, మౌలిక వసతుల విస్తరణ, నగర నిర్వహణలో ఆయనకు ఉన్న అనుభవం ఒంగోలు నగరాభివృద్ధికి ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడంతో పాటు నగరాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం కల్పిస్తారనే ఆశతో కార్పొరేషన్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కొత్త కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## బస్‌స్టేషన్ ప్రాంగణంలో బల్లలు ఏర్పాటు

- ఆర్ఎం సత్యనారాయణ చొరవతో ప్రాంగణానికి మహర్దశ

**బల్లికురవ, మే 14, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన బల్లికురవ ప్రధాన కూడలిలో నిరుపయోగంగా శిథిలావస్థకు చేరిన బల్లికురవ బస్ స్టేషన్ ప్రాంగణానికి మంచి రోజులు రానున్నాయి. బుధవారం ప్రకాశం జిల్లా రీజినల్ మేనేజర్ సత్యనారాయణ బస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. అంతకుముందే చిల్ల చెట్లు తో మూసుకుపోయిన ఆవరణలో చెట్లు తొలగించి, శుభ్రం చేశారు . గురువారం సాయంత్రానికి బస్ స్టేషన్ ప్రాంగణానికి ప్రయాణికుల సౌకర్యార్థం బల్లలు ఏర్పాటు చేశారు. అద్దంకి డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. త్వరలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు పరిశీలించారు. మరుగు దొడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, ప్రయాణికులకు వచ్చేందుకు వీలుగా రహదారి ఏర్పాటుపై పనులు ప్రారంభమయ్యాయి, అద్దంకి, చిలకలూరిపేట నుండి వచ్చే ప్రజా రవాణా సర్వీసులు బస్ స్టేషన్ ప్రాంగణం ద్వారా రాకపోకలు సాగించే విధంగా త్వరలో రీజినల్ మేనేజర్ కార్యాలయం నుండి స్పష్టమైన ఆదేశాలు రానున్నాయి. ఆర్ఎం సత్యనారాయణ ప్రత్యేక చొరవతో, మండుటెండలో రోడ్ల వెంట ప్రయాణికులు నిలబడి బస్సుల కోసం పడిగాపులు కాసే పరిస్థితికి శాశ్వతంగా పరిష్కారం లభించనుంది.



## నాలుగు వారాలలో సమస్యలకు పరిష్కారం: తాసిల్దార్ రవినాయక్

**బల్లికురవ, మే 14, ప్రభాతవార్త**



మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి నుండి అందే ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు"కార్యక్రమం, రెండవ గురువారము మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో జరిగింది. మొదటి గురువారం గ్రామసభలు గ్రామస్తుల నుండి 11 విజ్ఞాపనలు స్వీకరించారు. రెండవ గురువారం స్వీకరించిన విజ్ఞాపనలపై విచారణ కొనసాగించారు. నాలుగు గురువారాల లోపు 11 సమస్యలకు పరిష్కారం చూపే విధంగా తాసిల్దార్ రవి నాయక్ కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒకరోజు ఒక కార్యక్రమం వివరాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. గ్రామస్తులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు మరింత పారదర్శకంగా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ప్రజలంతా ప్రతి గురువారం జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. అర్జీల విచారణలో భాగంగా సత్వర పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ భాష, ప్రహర్ష, వీఆర్వో బోడపాటి అశోక్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## మర్లపాడులో కిషోర్ వికాసం కార్యక్రమం

**టంగుటూరు, మే 12, ప్రభాతవార్త**



ఐసిడిఎస్ కందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ సత్యవతి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మర్లపాడు అంగన్వాడీకేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామం, పాఠశాల, సమాజంలో పిల్లలు ఎదుర్కొనే సాముహిక అవసరాలు, సవాళ్లు అర్థం చేసుకోవడం గూర్చి అవగాహన కల్పించారు. ముఖ్యంగా 11 నుండి 18 ఏళ్ల మధ్య వయస్సు గల బాల, బాలికలలో శారీరక మార్పులు, ఆరోగ్యం, చట్టపరమైన హక్కులు, భద్రతపై అవగాహన కల్పించారు. పోషకాహారం ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణ, వాటి వల్ల కలిగే నష్టాలు గూర్చి సూపర్‌వైజర్ వివరించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ జయరాం, వెల్ఫేర్ శ్రీను, ఏయన్‌యం లీలమ్మ, ఎడబ్ల్యూబ్ల్యూ ఏటి శ్రీదేవి, ఎస్‌కె శీనమ్మ, వనిత, తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## బాలబాలికలపై లైంగిక దాడిచేస్తే కఠినచర్యలు: జడ్జి

**ఒంగోలు, ప్రభాతవార్త**




18 సంవత్సరాల లోపు బాల బాలికల పట్ల లైంగికంగా దాడి చేయడం వల్ల కఠినమైన ఫోక్సో యాక్ట్ కింద శిక్షలు విధించబడతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్ వి. రామకృష్ణ అన్నారు. గురువారం ఒంగోలు పట్టణంలోని స్వధార్ హోమ్ లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని బాల్యవివాహాల నిర్మూలన కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. అదేవిధంగా ఆగస్టు నెలలో గౌరవ సుప్రీంకోర్టు వారు నిర్వహించే లోక్ ఆదాలత్ నందు వ్యాజ్యాలు ఉన్నవారు తమ యొక్క న్యాయమైన సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మహిళలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకురాలు అరుణ, తమ్మిశెట్టి రమాదేవి, బీరం అరుణ పాల్గొన్నారు.

## గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

**చీమకుర్తి, మే 14, ప్రభాతవార్త**



చీమకుర్తి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో 2026-27 సంవత్సరానికి గాను ప్రవేశ దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ కెవిఎస్ వర్మ గురువారం తెలిపారు. మూడవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు చేరగోరు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందులో ఎస్టి ఖాళీలు 32,, ఎస్సీలకు 5, బీసీలకు రెండు, ఓసీ లకు ఒకటి సీట్లు ఖాళీగా ఉన్నాయని వారు తెలిపారు. అలాగే నాలుగో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు బ్యాక్లాగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయని ఎస్టీ విద్యార్థులు మాత్రమే దీనికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంప్రదించాల్సిన వారు 9493588554, 9948423348 ఫోన్ చేయాలని ప్రిన్సిపల్ కోరారు.

ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## క్విస్ ఉపాధ్యాయుడు పసుపుల ఠాగూర్ కుమార్‌కి డాక్టరేట్

**ఒంగోలు, ప్రభాతవార్త**




ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న పసుపుల ఠాగూర్ కుమార్ డాక్టరేట్ అందుకున్నారు. జేఎన్ టీయూ కాకినాడ యూనివర్సిటీలో ఆయన పీహెచ్ డీ పూర్తి చేశారు. వైర్ ఆర్క్ ఎడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ ఆఫ్ ఏఏ5356 ఆఫ్ ఫంక్షనల్ ప్రాపర్టీస్ విత్ ఆర్క్ కరక్షన్ లెంత్ అండ్ అప్లికేషన్ " అనే అంశంలో ఆయన రిసెర్చ్ చేశారు. టర్బైన్ బ్లేడ్ ని కన్వర్షన్ పద్ధతిలో కాకుండా ఎడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ పద్ధతిలో సులువగా ఎలా తయారు చేయాలో ఈ రిసెర్చ్ ఉపయోగపడుతుంది. జేఎన్ టీయూ కాకినాడలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.జయప్రసాద్ గైడెన్స్ లో ఠాగూర్ రిసెర్చ్ చేసి, డాక్టరేట్ అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న ఠాగూర్‌కుమార్‌ని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ శ్రీ గాయత్రిదేవి, ప్రిన్సిపల్ హనుమంతరావులు అభినందించారు.

# పొంచి ఉంది..స్మార్ట్ మీటర్ల గండం

- ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుకు కేంద్రం ఆదేశాలు
- మొబైల్ మాదిరిగా ముందే రీచార్జ్.. లేదంటే కరెంటు బంద్
- బిల్లుల పారదర్శకత కోసమేనని చెప్తున్న కేంద్ర ప్రభుత్వం
- గృహ వినియోగదారులకు బిల్లుల మోత, తప్పని భయ్యాలు

**ఒంగోలు, ప్రభాతవార్త**




చేతిలోని ఫోన్‌కు రీఛార్జ్ చేసుకున్నట్లే త్వరలో మన ఇంట్లో కరెంటు కోసం ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏదైనా పనిలో పడి సమయానికి రీఛార్జ్ చేసుకోవడం మరిచిపోయారో గుడ్డిదీపమో, కొవ్వొత్తో వెలిగించుకోవాల్సిందే. విద్యుత్ రంగ సంస్కరణలో భాగంగా దేశ వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించారు. ఇంకా రీఛార్జ్ చేసుకునేది ముందుకు రాలేదు. గృహ, సాగు, తాగునీటి పథకాల్లో తప్పనిసరిగా మీటర్లు బిగించాలని మార్చి 26న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ గెజిట్ విడుదల చేసింది. విద్యుత్ సరఫరా సేవలను మెరుగుపరచడం, బిల్లింగ్‌లో పారదర్శకత, డిజిటల్ విధానాన్ని ప్రోత్సహించడం ఈ నిర్ణయం వెనుక లక్ష్యం అని చెప్తుంది. దీని ప్రకారం కమ్యూనికేషన్ నెట్వర్క్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దశల వారీగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని మీటర్ రీటింగ్, బిల్లుల జారీ కోసం సిబ్బంది ఇంటింటికి తిరగాల్సిన అవసరం లేదని, బిల్లింగ్ లోపాలు తగ్గే అవకాశం ఉందని చెప్తున్నారు. స్మార్ట్ మీటర్లతో వినియోగదారులపై పరోక్షంగా భారం పెరుగుతుందని ఏపీ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. స్మార్ట్ మీటర్లు అంటే ఓ రకంగా మొబైల్ టాక్‌టైం, డేటాను రీఛార్జ్ చేసుకున్నట్లే. ఎంత విద్యుత్ అవసరమో ఆ మేరకు ముందుగా డబ్బును కట్టి రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రతి రోజు వినియోగదారుడు కరెంట్ వాడకాన్ని గమనిస్తున్నారు. సగటు కన్నా ఎప్పుడైనా ఎక్కువగా వాడుకుంటే తక్షణమే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. రీఛార్జ్ చేయడంలో ఆలస్యం అయిన కరెంటు బంద్ అవుతుంది. ఎక్కువ లోడ్ ఉన్న కనెక్షన్లు కలిగిన వినియోగదారులకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర విద్యుత్ సమైక్య స్పష్టం చేసింది. ఈ ఫలితంగా పరిశ్రమలు, వాణిజ్యసంస్థలు వంటి పెద్ద వినియోగదారులతో పాటు ఎత్తిపోతుల పథకాలు, తాగునీటి పథకాలు, వీధి దీపాలు, ఇతర ప్రజాపయోగ కార్యక్రమాలకు వినియోగించే సంస్థలకు ఈ స్మార్ట్ మీటర్లు గుదిబండగా మారుతాయని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. కమ్యూనికేషన్ నెట్వర్క్ లేని అడవి, కొండ, మారుమూల ప్రాంతాల్లో కూడా స్మార్ట్ మీటర్లు పెట్టాలనే నిబంధన పేర్కొన్నారు. ఇది ఎలా ఆచరణ సాధ్యమని అధికార వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లకు అయ్యే వ్యయాన్ని ఏక కాలంలో కూకుండా విడతల వారీగా వినియోగదారుల నుంచి డస్కంలో వసూళ్లు చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి సాధారణ మీటర్లతో పోలిస్తే వీటితో కరెంటు బిల్లులు ఎక్కువే చెల్లించాల్సి వస్తుందని, వాటిని వినియోగంలోకి తెచ్చిన చోట ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇక ఈ మీటర్లు కలిగిన వారంతా నెల రోజులు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాలి. 30 రోజుల వినియోగానికి రీఛార్జ్ చేసుకుంటే వారం రోజుల పాటు గ్రేస్ పిరియడ్ వినియోగదారునికి లభిస్తుంది. బిల్లు చెల్లించడం ఏ మాత్రం మరిచిపోయిన ఇంట్లో చీకట్లు అలుముకుంటాయన్న ఆందోళన వ్యక్తమవుతుంది. మరో వైపు వీటి వల్ల పేద విద్యుత్ వినియోగదారులకు కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వాదన కూడా వినిపిస్తుంది. ఖచ్చితమైన సమయానికి రీఛార్జ్ చేసుకోవడానికి వీరి వద్ద డబ్బు ఉండకపోవచ్చుని, అలాంటి వారు చీకట్లో మగ్గిపోవాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల విధానాన్ని ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. ఏపీలో కూడా చాలా చోట్ల స్మార్ట్ మీటర్లు బిగించారు. అయితే ఇంకా రీఛార్జ్ ప్రీపెయిడ్ ఇంకా వదలలేదు. కొన్ని ప్రాంతాల్లో ఈ మీటర్ల కారణంగా ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఒంగోలులో భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మాస్టర్ ప్లాన్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగర వాణిజ్య అభివృద్ధికి జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బుధవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నగరాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పాత కూరగాయల మార్కెట్ సెంటర్ ప్రాంతాన్ని ఆధునిక వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అక్కడ భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఒకేచోట అన్ని రకాల వాణిజ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా, పార్కింగ్, డ్రైనేజీ, భద్రత, పరిశుభ్రత వంటి మౌలిక వసతులతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న వ్యాపార అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆధునిక మార్కెట్ వ్యవస్థను తీసుకురావడం ద్వారా స్థానిక వ్యాపారులకు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పాత మార్కెట్ ప్రాంతం అభివృద్ధి చెందడం ద్వారా నగరానికి కొత్త వాణిజ్య గుర్తింపు వస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామ్ భూపాల్ రెడ్డి పాల్గొని ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక అంశాలను వివరించారు. త్వరలోనే స్థల పరిశీలన పూర్తి చేసి నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఏటీఎం కార్డు మార్చి రూ.50 వేలు కాజేసిన ఘరానా మోసం

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలో ఏటీఎం కార్డు మార్చి రూ.50 వేల నగదు కాజేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. రావినూతల గ్రామానికి చెందిన యేసయ్య వ్యక్తిగత అవసరాల కోసం నగదు డ్రా చేసేందుకు ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏటీఎంకు వెళ్లాడు. డబ్బులు తీసుకునే సమయంలో యంత్రం సరిగా పనిచేయడం లేదని గమనించిన అతడికి అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి సహాయం చేస్తానంటూ దగ్గరయ్యాడు. తనకు ఏటీఎం వినియోగంపై పూర్తిగా అవగాహన లేకపోవడంతో యేసయ్య ఆ వ్యక్తిని నమ్మి తన కార్డు ఇచ్చి పిన్ నంబర్ కూడా చెప్పాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న నిందితుడు చాకచక్యంగా అసలు కార్డును మార్చి మరో కార్డు యేసయ్యకు ఇచ్చి అక్కడి నుంచి పరారయ్యాడు. కొద్దిసేపటి తర్వాత మొబైల్‌కు వచ్చిన సందేశాల ద్వారా తన ఖాతా నుంచి విడతల వారీగా రూ.50 వేల నగదు డ్రా అయినట్లు యేసయ్య గుర్తించాడు. దీంతో షాక్‌కు గురైన బాధితుడు వెంటనే బ్యాంకును సంప్రదించి ఖాతాను బ్లాక్ చేయించడంతో పాటు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఏటీఎం కేంద్రంలోని సీసీ కెమెరా దృశ్యాలను సేకరించి నిందితుడి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. ఇటీవల నగరంలో ఇలాంటి మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఏటీఎంల వద్ద అపరిచితుల సహాయం తీసుకోవద్దని, పిన్ నంబర్లు ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## దివ్యాంగ మహిళ ఆదిలక్ష్మీ హత్యను నిరసిస్తూ దివ్యాంగ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ఒంగోలు బస్టాండ్ సిగ్నల్ సమీపంలోని శ్రీరామ్ లాడ్జిలో దివ్యాంగ మహిళ ఆదిలక్ష్మి దారుణ హత్యకు గురైన ఘటనపై దివ్యాంగుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. గొంతు కోసి లాడ్జి గదిలో బంధించి హత్య చేసిన ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. బాధితురాలి భర్త మల్లికార్జున తెలిపిన వివరాల ప్రకారం వెంకటరమణ అనే వ్యక్తి ఈ హత్యకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల మధ్య ఆదిలక్ష్మి కార్యాలయానికి వెళ్తున్నానని ఇంటి నుంచి ఆటోలో బయలుదేరగా, రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో మల్లికార్జున అదే రోజు రాత్రి 8.30 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేసామని. అయితే పోలీసులు స్పందించడంలో ఆలస్యం చేశా రని, 24 గంటల తర్వాత మాత్రమే ఆమె ఆచూకీ గుర్తించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దివ్యాంగుల ప్రతినిధి చిట్టా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలక్ష్మీ హత్యను అమానుష, రాక్షస చర్యగా ఖండించారు. ఈ ఘటనపై ఇప్పటికే వన్‌టౌన్ సీఐ, జిల్లా ఎస్పీ, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హత్యకు పాల్పడిన వెంకటరమణను వెంటనే అరెస్ట్‌చేసి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు.సీసీ కెమెరాలు లేకుండా నిబంధనలు ఉల్లంఘిస్తూ లాడ్జి నిర్వహించిన యజమానిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితురాలి ఐదేళ్ల కుమారుడికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ పోషణ కోసం భర్త మల్లికార్జునకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.మృతురాలి భర్త మల్లికార్జున మాట్లాడుతూ తాను ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు అప్ర మత్తంగా వ్యవహరించి ఉంటే తన భార్య ప్రాణాలు కాపాడేవారని ఆవేదన వ్యక్తం చేశారు. లాడ్జిలో సీసీ కెమెరాలు లేకపోవడం విచారణకు ఆటంకంగా మారిందన్నారు. నిందితుడు ఎప్పుడు లాడ్జిలోకి వచ్చాడు, ఎప్పుడు బయటకు వెళ్లాడనే పూర్తివివరాలు వెల్లడించాలని పోలీసులను డిమాండ్ చేశారు.ఈ ఘటనపై దివ్యాంగుల సంఘాలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ న్యాయం జరిగే వరకుపోరాటం కొనసాగిస్తామని హెచ్చరించాయి.

## నెల్లూరు మహానాడుకు పొదుపు దెబ్బ..?

- చంద్రబాబు నిర్ణయంపై సస్పెన్స్..!

**ఒంగోలు, ప్రభాతవార్త**

నెల్లూరులో టీడీపీ మహానాడుపై సస్పెన్స్ నెలకొంది. ఈనెల 27 నుంచి 29వరకు మహానాడు నిర్వహణకు టీడీపీ అధిష్టానం ఏర్పాట్లు చేస్తోంది. అయితే చమురు సంక్షోభం నేపథ్యంలో మహానాడు వంటి భారీ కార్యక్రమం నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహానాడు నిర్వహణకు టీడీపీ సర్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, నైతికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశంఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలో పడినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోడీ పిలుపునివ్వడంతో పాటు స్వయంగా ఇంధన పొదుపునకు పూనుకున్నారు. అదే సమయంలో ప్రధాని సూచనలతో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పొదుపు చర్యలను అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో భారీగా ఖర్చయ్యే మహానాడు నిర్వహణపై సీఎం పునరాలోచనలో పడినట్లు చెబుతున్నారు. ఇలాంటి లక్షలాది మందితో మహానాడు నిర్వహిస్తే విమర్శలకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందని టీడీపీ అధిష్టానం పునరాలోచనలో పడినట్లు చెబుతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే కార్యకర్తలు, నాయకుల కోసం భారీగా రవాణా ఏర్పాట్లు చేయడంతో పాటు భోజనాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో అధినేత చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠతో కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. మరో వైపు మహానాడు నిర్వహణ ఆనవాయితీగా వస్తుండడంతో వాయిదా వేసే అవకాశం లేదని కూడా అంటున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహించే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఏటా మే నెలలో టీడీపీ మహానాడు నిర్వహిస్తుంది. ప్రతి ఏటా ఇదో పెద్ద పండుగలా నిర్వహించడం టీడీపీ ఆనవాయితీ. ఈ క్రమంలో ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు నెల్లూరులో మహానాడు నిర్వహించాలని పార్టీ ముందుగా నిర్ణయించింది. యువనేత నారా లోకేష్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టి తర్వాత తొలిసారిగా నిర్వహించే మహానాడును ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దాదాపు 19 కమిటీ2లతో శరవేగంగా పనులు చేస్తున్నారు. చరిత్రలో కనివినీ ఎరుగనట్లు మహానాడు సక్సెస్ చేస్తామని బుధవారమే మంత్రులు, పార్టీ నేతలు ప్రకటించారు. అయితే అదే రోజు రెండు రోజుల్లో ప్రభుత్వ పరంగా కీలక నిర్ణయాలు ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో మహానాడు నిర్వహణపై ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఉత్కంఠ రేపుతోంది.

## బ్లాక్‌స్పాట్స్‌ను పరిశీలించిన రవాణా, పోలీస్, ఎన్‌హెచ్ అధికారులు

**కొరిసపాడు, మే 14, ప్రభాతవార్త**



మండలంలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ ను రవాణా శాఖ, పోలీస్ శాఖ, ఎన్ హెచ్ 16 అధికా రులు గురువారం నాడు సంయుక్తంగా పరిశీలించారు. గుండ్లపల్లి గ్రోత్ సెంటర్,మేదరమెట్ల దాబా హోటల్స్ తో పాటు మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని అలవలపాడు చెక్ పోస్ట్ దాకా ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించారు. గుర్తించిన ప్రదేశాల వద్ద ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు చర్యల గురించి చర్చించి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఈ పరిశీలనలో జిల్లా రవాణా శాఖ అధికారి సుశీల, మేదరమెట్ల ఎస్సై ఎస్కే మహమ్మద్ రఫీలతోపాటు ఎన్‌హెచ్ 16 అధికారులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లను ప్రారంభించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

**కొత్తపట్నం, మే 14, ప్రభాతవార్త**

మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, తారు రోడ్లను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ గురువారం ప్రారంభించారు. మోటుమాల, గుండంమూల, కొత్తపట్నం, రాజుపాలెం, ఈతముక్కల, సంకువాని గుంట గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.మోటుమాల గ్రామంలో రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించిన మెయిన్ రోడ్ సీసీ రోడ్డును ప్రారంభించారు. గుండంమూల నుంచి మోటుమాల వరకు రూ.67 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును ప్రజలకు అంకితం చేశారు. కొత్తపట్నం గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించగా, రాజుపాలెం గ్రామంలో రూ.1.70 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈతముక్కల గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. సంకువానిగుంట గ్రామంలో రూ.1.30 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ద్వారబాకుల శ్రీనివాస్‌రెడ్డి, కుంతూరి సత్యనారాయణరెడ్డి, జంపాల రామచంద్రరావు, సింగిరి శ్రీను తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత్ గ్యాస్ ఏజెన్సీ ఆకస్మిక తనిఖీ

**ఉలవపాడు మే 14 ప్రభాతవార్త**



మండల కేంద్రం లోని శ్రీ సాయి రామ్ భారత్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ మరియు ఆఫీసు ను జిల్లా పౌరసరఫరా అధికారి ఎస్ పద్మశ్రీ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గోడౌన్ లో ఖాళీ సిలిండర్లు మరియు ఫుల్ సిలిండర్లు ఎన్ని ఉన్నాయో చూసి ఆన్లైన్ రిపోర్ట్ ప్రకారం సరిపోయ్యాయ లేదా అని పరిశీలించారు. ధరల పట్టికల బోర్డులు వినియోగదారులకు అందుబాటులో ఉండేలాగా చూడాలని ఆదేశించారు. ఫుల్ సిలిండర్ ఇచ్చేటప్పుడు తప్పకుండా ఖాళీ సిలిండర్ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీ టీ విజయ్ భాస్కర్, విఆర్ఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**సంతనూతలపాడు, మే 14, ప్రభాతవార్త**

సంతనూతలపాడులో వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ జి.లక్ష్మీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద గురువారం నాడు వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, లక్ష్మీ వివాహ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మజ్జిగ పంపిణీ కారక్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు,లక్ష్మీ దంపతులకు వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ వేమూరి నాగేంద్ర ప్రసాదరావు తదితరులు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, సెక్రటరీ శిఘాకొల్లి రాజేష్, గౌరవ అధ్యక్షులు వేమూరి వేషారావు, వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్లు వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, గ్రంధి లక్ష్మీ ప్రసాదరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం సహాయ కార్యదర్శి జి.శరత్‌బాబు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు వేమూరి నాగమణి, సెక్రటరీ ఎస్.జయశ్రీ, కోశాధికారి జి.శ్రీలక్ష్మీ, గౌరవ అధ్యక్షురాలు జి.సులోచన, వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షులు జి.వెంకటలక్ష్మీ, రిటైర్డ్ హెచ్ఎం పీపీ శ్రీనివాస్, డైరీ మాజీ డైరక్టర్ చెరుకూరి బోసు, వాసవి మహిలా క్లబ్ మాజీ అధ్యక్షులు పాదర్తి గిరి, ఆర్యవైశ్య నాయకులు మునగా మారుతిరావు, నల్లమల్లి శ్రీనివాసరావు, వేమూరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిశోరి వికాసంపై మండల స్థాయిలో ఎంపీడీవో సురేష్‌బాబు సమీక్ష



**సంతనూతలపాడు, మే 14, ప్రభాతవార్త**

సంతనూతలపాడుమండల పరిషత్ కార్యాలయం లో గురువారం నాడు కిశోరి వికాసం వేసవి సెలవుల శిక్షణ తరగతుల స్పెషన్ ఆరోగ్యం మేళా పై మండల స్థాయిలో అధికారులతో ఎంపీడీవో డి.సురేష్‌బాబు సమీక్ష నిర్వహించారు. కిశోర్ బాలబాలికలను ముఖ్యంగా మంచి పరివర్తనపై చైతన్యపరచాలని ఎంపీడీవో సురేష్‌బాబు ఈ సందర్భంగా కోరారు. కిశోర్ వికాసాన్ని గ్రామ కమిటీల ద్వారా ముఖ్యంగా కిశోర్ బాలబాలికలను అన్ని రంగాల్లో రాణించేందుకు వారిని మరింతగా చైతన్య పరచాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. బాల్య వివాహాలు నివారణకు ముఖ్యంగా తల్లిదండ్రులను చైతన్యపరచాలన్నారు.ఈ సమావేశంలో ఎంఈఓ డి.వెంకారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సావిత్రి, వెలుగు ఏపీఎం టి.బాబురావు, డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్, సీహెచ్ఓ మాధవరావు, మండల టీడీపీ మహిళా సమైక్య అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, వైద్య, మండల పరిషత్, వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# కిశోరి వికాసంపై అవగాహన



**నాగులుప్పలపాడు, మే 14, ప్రభాతవార్త**

మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలో గల నాగులుప్పలపాడు మండలంలో కిశోరి వికాసం వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమం నందు కిశోర బాలబాలికలకు గ్రామస్థాయిలో ప్రతి రోజు జరిపించాల్సిన సెషన్,అవసరాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు గురించి గ్రామస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా మండల లెవల్ కమిటీ వారిని కోరటం జరిగింది. లైన్ డిపార్టుమెంట్ వారు అందరు కిశోరి బాలబాలికలకు గ్రామ స్థాయిలో ఇవ్వాల్సిన శిక్షణ గురించి పీపీటీ ప్రదర్శించడం జరిగింది. ఈ సమావేశం నందు ఎంపీడీవో, ఎంఈఓ, ఏపీఎం, ఈవోపీఆర్డీ, మండల సమాఖ్య ప్రెసిడెంట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.

## చెట్లను తొలగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు



**నాగులుప్పలపాడు, మే 14, ప్రభాతవార్త**

ఉప్పుగుండూరు గ్రామంలోని జడ్పీ పార్కు ముందున్న స్థలంలోని చెట్లను తొలగించిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని మన మూరు మన పార్కు అభివృద్ధి కమిటీ సభ్యులు మున్నంగి వెంకటరావు, ఉన్నం వెంకటరావు, పెంట్యాల కోటేశ్వరరావు, బాబులు కోరారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఇందుకు సంబంధించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులో గానుగచెట్టు, పూల చెట్లు, వేప చెట్లు తదితర చెట్లు ఉప్పుగుండూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఎటువంటి అనుమతులు లేకుండా క్రేన్ సహాయంతో తొలగించారు. ఈయన ఊరు మన పార్కు నందు ప్రతి రోజు 100 నుండి 150 మంది పిల్లలు మహిళలు, పురుషులు వాకింగ్, షటిల్ , తదితర ఫిట్నెస్ కొరకు ఉపయోగించుకుంటున్నారు. ఇంత వరకు హాస్పిటల్‌కు సంబంధించి అనుమతులు ఆ స్థలంలో నిర్మించుటకు ఇవ్వలేదు. కావున ముందస్తుగా చెట్లు తొలగించుట చట్టరీత్య నేరమని, సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## డిఆర్‌డిఏ పిడిని సత్కరించిన వెలుగు సిబ్బంది, వివోఏలు

### - డిఆర్‌డిఏ పిడి శివన్నారాయణ



**రాచర్ల మే 14, ప్రభాతవార్త**

రాచర్ల వెలుగు కార్యాలయం పరిశీలనకు గురువారం వచ్చిన డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి శివన్నారాయణను కార్యాలయ సిబ్బంది, వివోఏలు పిడిని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ బి శివన్నారాయణ మాట్లాడుతూ 2026 - 27 సంవత్సరానికి సంబంధించి గ్రూప్ సభ్యుల ఆర్థిక అభివృద్ధికి రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి శివన్నారాయణ అన్నారు. రాచర్ల వెలుగు కార్యాలయంలో వార్షిక జీవనోపాదులుపై జరిగే ప్రణాళికలను, చేపడుతున్న చర్యల గురించి ఆయన పరిశీలించి క్లస్టర్ వివోఏలతో చర్చించారు. వెలుగు సిబ్బంది, వివోఏలతో తోడ్పాటుతో గ్రూపు సభ్యులకు అందుబాటులో ఉంటూ ఆర్థిక సంవత్సర రుణాల టార్గెట్ పూర్తి చేయాలన్నారు. గ్రూపు సభ్యులకు అవసరమైన రుణాల వివరాలు వెలుగు సీసీలు వారి లాగిన్ నందు పూర్తిచేసి ఆ ప్రకారం 2026-27 సంవత్సరానికి రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవనోపాదుల డిపిఎం దానం, ఏపిఎం పిచ్చయ్య, రాచర్ల వెలుగు కార్యాలయం ఏపిఎం గోపాలకృష్ణ, సిసిలు కృష్ణయ్య వెంకటయ్య, స్త్రీనిధి మేనేజర్ వినయ్ కుమార్, కార్యాలయ అకౌంటెంట్ రాజకుమారి, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 18న ఒంగోలులో పొగాకు రైతు సదస్సు

### - పోలినేనిపాలెంలో కరపత్రాలు ఆవిష్కరణ



**కందుకూరు మే 14, ప్రభాతవార్త**

ఈనెల 18వ తేదీన ఒంగోలులలో ప్రకాశం జిల్లా పొగాకు రైతుసదస్సు ఒంగోలులో నిర్వహస్తున్నట్లు వలేటివారిపాలెం మండల రైతుసంఘం కన్వీనర్ మాదాల రమణయ్య తెలిపారు.ఉదయం 10గం॥లకు ఎన్జీరంగా భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు రైతులు బారీగా తరలిరావాలని ఆయన కోరారు.ఈ మేరకు బుధవారం పోలినేనిపాలెంలో ఇందుకు సంబందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు క్వింటాల్ 1కి రూ.36వేలు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.రోజురోజుకు పొగాకు ధరలు పడిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, నోబిడ్లు 50శాతం పైగా కొనసాగుతున్నాయన్నారు,అయినా ప్రభుత్వ స్పందన కరువైందన్నారు.జిల్లా మంత్రులు,ప్రజా ప్రతినిధులు,ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని ఆయన సూచించారు.గత సంవత్సర నష్టాలతో రైతులు కోలుకోలేని స్థితిలో ఉన్నారని అన్నారు. ఈ ఏడాది సైతం కంపెనీలు రైతులను ముంచే పరిస్థితిలో ఉన్నాయని ఆరోపించారు.ఈ నేపధ్యంలో నిర్వహించే పొగాకు రైతుసదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఇందుకోసం వలేటివారిపాలెం,కందుకూర్‌లోని రెండు పొగాకు వేలంకేంద్రాల నుండి అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండలకమిటీ సభ్యులు చింతలపూడి మాధవరావు, రైతులు సోమినేని రవీంద్ర,పొట్లపల్లి లక్ష్మీనరసింహం,మాదాల మాధవరావు, కంచర్ల వెంకటేశ్వర్లు, అనుమోలుమహేష్,కంచర్ల కొండయ్య,మామిళ్ళపల్లి మహేష్,అనుమోలు నరసింహం, అనుమోలు వెంకటేశ్వర్లు,అనుమోలు రాంబాబు, గుత్తా బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీగంగా భవాని అనుగ్రహం ప్రజలందరికి ఉండాలి

### - దద్దాల, గంగసాని





**పామూరు, మే 14, ప్రభాతవార్త**

పామూరు మండలం మోపాడు రిజర్వాయర్ వద్ద వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ గంగా భవాని తిరునాళ్ల మహోత్సవంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శక్తి స్వరూపిణి, పవిత్రతకు నిలయమైన గంగా భవాని మాత అనుగ్రహం, ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని, ప్రజలందరికి ఆరోగ్యం, ఆయుష్షు కలగాలని, సుఖ సంతోషాలు, ఐశ్వర్యం, వెల్లివిరియాలని, సమాజంలో శాంతి, పవిత్రత నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ తిరునాళ్ల మహోత్సవంలో పామూరు మండల అధ్యక్షురాలు గంగసాని లక్ష్మీ, వైసీపీ పామూరు మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్‌రెడ్డి, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వెలిగండ్ల జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, సీఎస్‌పురం జడ్పీటీసీ మేకల శ్రీనివాసులు యాదవ్, జిల్లా వైసీపీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పోలినేని శ్రీనివాసుల చౌదరి, వాకమల్ల రాజశేఖర్‌రెడ్డి, కందుల శ్రీనివాసులురెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడిమాల అనంతరెడ్డి, ఆవుల రామకృష్ణ, తుపాకుల ఆంజనేయులురెడ్డి, శ్రీరామ శ్రీనివాసులు, రేగలగడ్డ నాగరాజు, చెనికల శ్రీనివాసులు, బద్రి స్వామి రంగారెడ్డి, కోటపాటి రవికుమార్‌రెడ్డి, ముడిమాల నారాయణరెడ్డి, మేడబోయిన అటేలయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డి, బత్తుల దేవరాజు, మన్నేపల్లి పెద్దన్న, జొన్నలగడ్డ గోవిందయ్య, షేక్ నాయబ్ రసూల్, కోటా వెంకట కృష్ణారెడ్డి, చింతలపూడి మల్లిఖార్జునరెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, సూరిపోగు మాల్యాద్రి, బుర్రెరెడ్డి శ్రీనివాసులరెడ్డి, యర్రంరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, తుమ్మా రవి, సైకం సుబ్బారెడ్డి, కందుల సుబ్బారెడ్డి, కందుల మల్లిఖార్జున, షేక్ ఆరిఫ్, పుట్లూరి రవీంద్రరెడ్డి, దొడ్డా నాగభూషణం, మొగల్లూరి మాల్యాద్రి, అయిమెల్ల నాగమణి, షేక్ షకీలా, రాచూటి, సుష్మిత, యర్రగొర్ల నర్సింహ, పోలుబోయిన నరసింహ, మూలే కోటిరెడ్డి, బూసరాజు హరీష్, దూపాటి నారాయణరావు, దూపాటి జగన్, వేంపాటి నారాయణ, యాట రాఘవేంద్ర, మడతల ఓబులురెడ్డి, ఎల్లి నరసింహం, షేక్ రసూల్, షేక్ పఠాన్ రఫీ, షేక్ రసూల్, షేక్ నాయబ్ రసూల్, షేక్ రసూల్, యాటా వీరాస్వామి, మేడబలిమి దిలీప్, కొల్లా రమణయ్య, కోడూరి రామసుబ్బారెడ్డి, దొడ్డా చెంచయ్య, దండు నారాయణ రెడ్డి, పైడాల వెంకటరెడ్డి, గాజులపల్లి బాబు, పోలు మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, ఎండ్లూరి సాల్మన్, రాచకొండ మధు, కొలనీడి నరేష్, బొట్ల హజరత్, బొట్ల కిష్టయ్య, పోలంరెడ్డి రవణారెడ్డి, గాజుల నాగేశ్వరరావు, సంటంరెడ్డి, మహానందరెడ్డి, కోటా సుధాకర్‌రెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, వేముల మల్లిఖార్జున, గుంజి మహాలక్ష్మయ్య, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెయింట్ మార్క్స్‌లో కొనసాగుతున్న స్టేట్ ర్యాంకుల పరంపర





**పామూరు, మే 14, ప్రభాతవార్త**

ఇటీవల జరిగిన ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. ఈ పరీక్షా ఫలితాల్లో ఇద్దరు సెయింట్ మార్క్స్ విద్యార్థులకు 2000 లోపు ర్యాంకు రావడం జరిగింది. ఎస్‌కే అల్సియా స్టేట్ 1288వ ర్యాంకు, జి.సంతోష్‌రెడ్డి స్టేట్ 1790వ ర్యాంకు సాధించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఎం.జయకుమార్ మాట్లాడుతూ ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలలో మా స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించడం హర్షణీయమని, అంతే కాదు భవిష్యత్తులో కూడా ఐఐటీ, నీట్, ఎన్ఐటీ, ఇతర పోటీ పరీక్షలలో కూడా మా విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తారని ఆకాంక్షించారు. తమ పిల్లలు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడంలో బోధించిన ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలియజేశారు.

## వేసవి సెలవుల్లో యువతీయువకుల బంగారు భవిష్యత్



**కందుకూరు మే 14, ప్రభాతవార్త**

యువత బంగారు భవితకు అవసరమైన సలహాలు సూచనలపై అవగాహన కల్పించాలని స్థానిక ఎంపీడీవో పి.రత్నజ్యోతి అధికారులకు సూచించారు. వేసవి సెలవుల్లో యువతీయువకుల బంగారు భవిష్యత్‌కు చేపట్టాల్సిన పలు అంశాలపై అవగాహన నిమిత్తం సమ్మర్‌స్పెషల్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సంబందిత అనుభందశాఖల అధికారులుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఇందులో కోసం ఆయా సచివాలయాల పరిధిలో పీఆర్ కార్యదర్శి చైర్మన్‌గా అంగన్‌వాడీ అధికారి కన్వీనర్‌గా పీఆర్,పోలీస్,యువజనశాఖ,వైద్యశాఖ తదితర అనుభందశాఖల ప్రతినిధులు సభ్యులుగా ఆయా సచివాలయాలతోపాటు మండల,డివిజన్,జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేయాలి. యువతీయువకులతో గ్రూపులు ఏర్పాటు చేయాలి.వీరికి పలుఅంశాలపై అవగాహన కల్పించాలి. ఇందుకోసం యుద్ధప్రాతికన సభలు సమావేశాలు నిర్వహించాలి.ఇందులో బాగంగా బుధవారం కందుకూరు మండల పరిషత్ ఆవరణలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సలహాలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మెప్మా సీఈఓ,మెడికల్ ఆఫీసర్ ఎం మోనిక సూపర్వైజర్ షకీలా బేగంతో పాటు పలువురు పాల్గొన్నారు.

# తెదేపా నేతలకు దివి రవీంద్రనాద్ పరామర్శ



**కందుకూరు మే 14, ప్రభాతవార్త**

కందుకూరు నియోజకవర్గంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఇటీవల కాలంలో పలు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.పలు వైద్యశాలలో వైద్యచికిత్స అనంతరం వారి వారి నివాసాలలోవిశ్రాంతితీసుకుంటున్నారు.ఈ సమాచారం తెలుసుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త దివి రవీంద్రనాథ్ బుధవారం సంబందిత బాధితుల నివాసాలకు వెళ్లిపరామర్శించారు.పట్టణపార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు కంటిఆపరేషన్,పట్టణపార్టీ కోశాధికారి కొత్తూరి సుధాకర్ గుండెకు స్టంట్ ఆపరేషన్,శాఖవరం రేషన్‌షాపు మాజీ డీలర్ వడ్లమూడి రామకృష్ణ మోకాలుకు శస్త్రచికిత్సలు చేయించుకున్నారు.దీనితో రవీంద్రనాథ్ బుధవారం వారివారి నివాస గృహాలకు వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకొవాలని, ప్రజా జీవితంలోకి రావాలని రవీంద్రనాథ్ ఆకాంక్షించారు.ఈసందర్భంగా ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు కాకర్ల మల్లికార్జునరావు, ఉన్నంపాండురంగారావు,వడ్డెళ్ళహరికృష్ణ,ముప్పురాజు శ్రీహరి,మోదడుగు వెంకటేశ్వర్లు, నీలిశెట్టి సుబ్రహ్మణ్యం,వడ్లమూడి శ్రీహరిరావు,కూరాకుల శ్రీనివాసరావు,దాచర్ల శ్రీనివాసరావు తదితరులున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కదిరి పార్థసారధి



**పామూరు, మే 14, ప్రభాతవార్త**

పామూరు పట్టణానికి చెందిన కదిరి రాంబాబు కుమార్తె లక్ష్మీహాసిని వివాహ వేడుక బుధవారం రాత్రి పామూరులోని సత్యనారాయణ స్వామి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారధి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి పిచ్చయ్య, కదిరి రమణయ్య, కదిరి కృష్ణ, ఆకుపాటి వెంకటేష్,గద్దె సుధాకర్, తికణం బాబురావు, నున్నా నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పేరుతో వైసీపీ రాజకీయ డ్రామా

### - రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం డాక్టర్ ఏలూరి



**మార్కాపురం, మే 14, ప్రభాతవార్త**

పొగాకు రైతులను గతంలో పూర్తిగా నిరక్ష్యం చేసిన వైసీపీ నేతలు ఇప్పుడు రాజకీయ లాభాల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫల మైందన్నారు. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ సదుపాయాలు, సాంకేతిక సహాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. రైతుల పేరుతో అసత్య ప్రచారాలు చేయడం మానుకుని వైసీపీ నేతలు వాస్తవాలను గుర్తించాలని ఆయన సూచించారు.

## మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి - సీఐ వై. శ్రీహరి



**సింగరాయకొండ, మే 14, ప్రభాతవార్త**

మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) చట్టాలపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని సింగరాయకొండ సీఐ వై. శ్రీహరి తెలిపారు. ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ ఐపీఎస్ సూచనల మేరకు,ఒంగోలు డీఎస్పీ శ్రీ రాయపాటి శ్రీనివాసరావు ఆదేశాల ప్రకారం గురువారం స్థానిక దేవిసీ ఫుడ్స్ ఫ్యాక్టరీలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, గృహహింస, వరకట్న వేధింపులు, అపహరణలు, యాసిడ్ దాడులు వంటి నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న బిఎన్ఎస్ చట్టాలపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.శక్తి టీమ్స్ బహిరంగ ప్రదేశాల్లో వేధింపులను అరికట్టేందుకు పనిచేస్తున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు 112,100 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదు చేసి పోలీసుసేవలను వినియోగించుకోవాలని సూచించారు.మహిళలకు అన్నివేళలా పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసాకల్పించారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీయాజమాన్యం,మహిళా కార్మికులు,పోలీసులు పాల్గొన్నారు.

## ఎయిడెడ్ పాఠశాలలకు రెండో ఉపాధ్యాయుడిని కేటాయించాలి - ఏపీటీజీ డిమాండ్

**సింగరాయకొండ, మే 14, ప్రభాతవార్త**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 48 ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు బోధన నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొనడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, వెంటనే రెండో ఉపాధ్యాయుడిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ (ఏపీటీజీ) జిల్లా అధ్యక్షుడు కె. వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్ రెడ్డి గురువారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.మండలాల వారీగా ఒంగోలు 9, నాగులుప్పలపాడు 5, మద్దిపాడు 2, చీమకుర్తి 1, బెస్తవారిపేట 1, కనిగిరి 2, హనుమంతునిపాడు 2, వెలిగండ్ల 3, కంభం 3, మార్కాపురం 2, గిద్దలూరు 4, కొమరోలు 2, అద్దంకి 1, పర్చూరు 2, యద్దనపూడి 1, ఉలవపాడు 1 పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడే పనిచేస్తున్నారని తెలిపారు.ఒకే ఉపాధ్యాయుడితో అన్ని తరగతులకు బోధన జరగడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతింటోందని, ఉపాధ్యాయులు సెలవులు తీసుకోవాల్సి వచ్చినప్పుడు యాజమాన్యాలు, మండల విద్యాశాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలో మిగులుగా ఉన్న 202 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించి అవసరమైన పాఠశాలలకు నియమిస్తే విద్యాబోధనకు ఆటంకం ఉండదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## విద్యుత్ సిబ్బంది వినియోగదారులతో మమేకం కావాలి

### - దర్శి ఏపీ సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరావు



**కొనకనమిట్ల, మే 14, ప్రభాతవార్త**

విద్యుత్ సిబ్బంది వినియోగదారులతో సానుకూలంగా ఉండాలని, ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని దర్శి ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు గురువారం కొనకనమిట్ల విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో మండల విద్యుత్ అధికారులు, సిబ్బందితో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ మీద సమావేశం నిర్వహించారు. విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని, అప్పుడే వినియోగదారుల నుంచి మన్ననలు పొందవచ్చన్నారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్(సానుకూల ప్రజాభిప్రాయం)లో ఇంప్రూవ్ చేసుకోవడానికి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని వారితో ఫోన్లో ఎప్పుడూ అందుబాటులో ఉండాలని వారికి ఏ సమస్య ఉన్నా త్వరితగతిన హాజరై సమస్యను తీర్చాలని ఈ సమావేశంలో తెలియజేశారు.ఈ సమావేశానికి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు, ఏఈ ఎస్.వీరబ్రహ్మం, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలను పరిశీలించిన అధికారులు




**కొనకనమిట్ల, మే 14, ప్రభాతవార్త**

కొనకనమిట్ల 565 జాతీయ రహదారి నుండి ఎస్సీ కాలనీలకు వెళ్లే రహదారి ఆనుకొని నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఎస్సీ కాలనీ వాసులు కొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీఆర్వో, శ్రీనివాసరెడ్డి, సర్వేయర్‌లు గురువారం కట్టడాలను పరిశీలించారు. జాతీయ రహదారి ఆనుకొని అక్రమ కట్టడాలు కట్టడం వల్ల ఆ దారి గుండా ఎస్సీ కాలనీలకు వెళ్లాలంటే ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ఈ కట్టడాలు పూర్తి అయితే రహదారి గుండా వాహనాలు లోపలికి వెళ్ళటం కష్టతరమవుతుంది. కట్టడాలు పూర్తి అయితే కాలనీ వాసులు మరింత ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఈ రహదారి గుండా సుమారు 250 కుటుంబాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి గుండా నిత్యం వాహనాలు వెళ్తుంటాయి. ఈ కాలనీలలోకి వాహనాలు రావాలంటే దారి కనిపించక నానా ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని కాలనీ వాసులు అంటున్నారు. అంతే కాకుండా ఇల్లు నిర్మించుకునేటప్పుడు పెద్ద వాహనాలు కాలనీల లోపలికి రావాలంటే జాతీయ రహదారి దిగి రావాల్సి ఉంది. అక్కడ నిర్మాణాలు చేపట్టడం వల్ల వాహనాలు మలుపు తిరగాలంటే దారి కనిపించక అవస్థలు తప్పవు. ఈ రహదారి వెంబడి సాగర్ పైపులైను కలదు. సాగర్ పైపులైను వాల్ మరమ్మత్తులు గురైనప్పుడు రోడ్డు వెంబడి తవ్వి మరమ్మత్తులు చేయాల్సి ఉంది. ఈ నిర్మాణం చేపడితే ఇబ్బందులు పడే పరిస్థితిఉంది. వీఆర్వో శ్రీనివాసులురెడ్డిలు పరిశీలించినప్పటికి అక్రమ కట్టడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు నిలిపేయాలని అధికారులు చెప్పి వెళ్ళినట్టు తెలుస్తుంది.

# నేడే వీవీపాలెంలో బుర్రా జన్మదినోత్సవం

### - జగనన్న,మదన్న అభిమానులూ రండి !

### - మండల అధ్యక్షుడు అనుమోలు



**కందుకూరు మే 14, ప్రభాతవార్త**

మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ వైయస్సార్ పార్టీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్ యాదవ్ జన్మదిన కార్యక్రమాన్ని వలేటివారిపాలెంలో శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండల వైసీపీ అధ్యక్షుడు అనుమోలు లక్ష్మీనరసింహం తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కావున వైసీపీలో వివిద హోదాల్లో గల నేతలు, ప్రజాప్రతినిధులు,అనుబంధ సంఘాల నాయకులు,జగనన్న,మదన్న అభిమానులు అందరూ హాజరుకావాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా పార్టీపరంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# చుండిలో అంగన్‌వాడీ కార్యక్రమం



**కందుకూరు మే 14, ప్రభాతవార్త**

కందుకూరు ప్రాజెక్ట్ పరిధిలోని వలేటివారిపాలెం మండలం చుండి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పాఠశాల సంసిద్ధత మేళా కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో సిడిపిఓ కె.ఉషారాణి, ఎంఈవో-2 ఏ.మల్లికార్జునలు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. అంగన్వాడీ-1, 2లోని పిల్లలు పూర్వప్రాథమిక విద్యానంతరం ప్రాథమిక విద్యాభ్యసనానికి గల అర్హతలపై తల్లిదండ్రుల సమక్షంలో అసెస్మెంట్ నిర్వహించారు.ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ ఈకార్యక్రమ ఆవశ్యకతను వివరించారు .ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె.సునీత అంగన్వాడి వర్కర్స్ ఇరపని రాజలక్ష్మి,గోనుగుంట జ్యోతి,అయ్యవారిపల్లె కోటేశ్వరి,కాకర్లపాలెం అరుణతోపాటు పలువురు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో సమస్యలపై కలెక్టర్ ఫోకస్

- కలెక్టర్ ఎం విజయ సునీత సుడిగాలి పర్యటన
- డంపింగ్ యార్డ్ నుంచి మార్కెట్ యార్డ్ వరకు విస్తృత పరిశీలన
- పట్టణ సమస్యలపై క్షుణ్ణ పరిశీలన
- ట్రాఫిక్, పారిశుద్ధ్యం,మౌలిక వసతులపై అధికారులకు ఆదేశాలు







**మార్కాపురం, మే 14, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలో గురువారం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత సుడిగాలి పర్యటన నిర్వహించి పట్టణంలోని పలు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ పారిశుద్ధ్యం, ట్రాఫిక్, చెత్త నిర్వహణ, మార్కెట్ సదుపాయాలు, మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా గడియార స్తంభం సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రధాన కూడలి కావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నాగులవరం రోడ్డులోని రాజ్యలక్ష్మి కాలనీకి వెళ్లి జనగణన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు తమ ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం అందించాలని సూచించారు. తరువాత నెహ్రూ సెవెన్ హిల్స్ సెంటర్ జంక్షన్‌ను పరిశీలించిన కలెక్టర్, పట్టణానికి గుర్తుండేలా ప్రత్యేక నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం పట్టణ శివారులోని డంపింగ్ యార్డ్‌ను సందర్శించి చెత్త ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. చెత్త నుంచి సంపద సృష్టించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మార్కెట్ యార్డ్ జంక్షన్ వద్ద జిల్లాను ప్రతిబింబించేలా ప్రత్యేక చిహ్నం ఏర్పాటు చేయాలని సూచించిన కలెక్టర్, మార్కెట్ యార్డ్‌లో రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం టిడ్కో ఇళ్లను సందర్శించి అక్కడి మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత, ఆహార నాణ్యతపై అక్కడ భోజనం చేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా లబ్ధిదారులకు భోజనం వడ్డించి వారిని సంతోషపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, మున్సిపల్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే పాలన - మార్కాపురంలో ప్రజా దర్బార్

- 16న శుభం ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక అర్జీల స్వీకరణ కార్యక్రమం




**మార్కాపురం, మే 14, ప్రభాతవార్త**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో మార్కాపురంలో "ప్రజా దర్బార్ (పీ జీ ఆర్ ఎస్)" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కందుల నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 16వ తేదీ శనివారం మార్కాపురం పట్టణంలోని సప్తగిరి సెంటర్ వద్ద ఉన్న శుభంఫంక్షన్ హాల్ (పాత విశ్వేశ్వర థియేటర్)లో నిర్వహించబడనుంది. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులుతో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారు. మార్కాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాలు, రెండు మున్సిపాలిటీల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. రెవెన్యూ, గృహాలు, పింఛన్లు, భూ వివాదాలు, రేషన్, విద్యుత్, తాగునీరు, సంక్షేమ పథకాల అమలు వంటి ప్రజా సమస్యలపై అధికారులు నేరుగా స్పందించి పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లడం, అర్జీల పరిష్కారంలో పారదర్శకత పెంచడం, ప్రజలకు అధికారులతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే వివరించారు. ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే మీడియా ప్రతినిధులు కూడా కార్యక్రమానికి హాజరై సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# అంగన్వాడి చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**మార్కాపురం, మే 14,ప్రభాతవార్త**

మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్వాడీలలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు పాఠశాల సంసిద్ధత మేళా మరియు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి పీడీ ఎం. పద్మావతి ఆధ్వర్యంలో సీ సెక్టార్ పరిధిలోని సచివాలయం5 అంగన్వాడి కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఐటీసీ ప్రథమ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎస్. వెంకట్రావు మాట్లాడుతూ, ఆటపాటల ఆధారిత కార్యకలాపాల ద్వారా పిల్లల అభివృద్ధిని తల్లిదండ్రుల సమక్షంలో అంచనా వేసి, పాఠశాలకు సిద్ధం చేయడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. పిల్లల అభ్యసన స్థాయిలను తల్లిదండ్రులకు వివరించి, ఇంటి వద్ద అందించాల్సిన సహాయంపై అవగాహన కల్పించారు. శారీరక, సామాజిక, మేధో,గణిత, భాషా అభివృద్ధికి సంబంధించిన స్టాళ్లలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కే. రవికుమారి, గర్ల్స్ హై స్కూల్ టీచర్ ఎం. సునీత, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం నాయకురాలు పులుకూరి లక్ష్మమ్మ భౌతికకాయానికి నివాళులర్పించిన ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర



**పెద్దదోర్నాల, మే 14, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలం జమ్మిదోర్నాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పులుకూరి పెద్ద పుల్లయ్య సతీమణి లక్ష్మమ్మ మృతి పట్ల తెలుగుదేశం నాయకుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర గురువారం జమ్మిదోర్నాల మాదిగ పాలెం సందర్శించి పులుకూరి లక్ష్మమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. డాక్టర్ రవీంద్రతో పాటు టీడీపీ నాయకులు పులుకూరి పుల్లయ్య,మార్కెట్ యార్డు మాజీచైర్మన్ చేకూరి ఆంజనేయులు, యర్రగొండపాలెం టీడీపీ మాజీ అధ్యక్షులు వడ్లమూడి లింగయ్య, షేక్ జిలాని, పెద్దారవీడు మండల మాజీ అధ్యక్షుడు వెన్న వెంకటరెడ్డి, త్రిపురాంతకం మాజీ కన్వీనర్ ఊట్ల సీతారామయ్య, దోర్నాల మండలం మైనార్టీ నాయకులు షేక్ జాకీర్, కాశీం భాషా, భాష, హర్షద్, సతీష్ కుమార్, చంద్, జమ్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేపల కోసం పోయి జమ్ములో కూరుకొని వ్యక్తి మృతి



**సీఎస్‌పురం, మే 14, ప్రభాతవార్త**

వాగులో చేపల పట్టుకోవడానికి వెళ్లి జమ్ములో కూరుకుని వ్యక్తి మృతి చెందిన మండలంలో గురువారం చోటు చేసుకుంది. మండలకేంద్రమైన సీఎస్‌పురంకు చెందిన పామూరు మెయిన్ రోడ్డు మహాలక్ష్మి వీధి ఎదురు బజార్‌కు చెందిన వెంకటేశ్వర్లు, మరో ఇద్దరితో సీఎస్‌పురం చెరువు కట్ట కింద కొర్లమడుగు వాగులో చేపలు పట్టుకోవడానికి వెళ్లారు. దీంతో వాగులో ఉన్న జమ్ములో వెంకటేశ్వర్లు కూరుకుపోయి బయటకు రాలేక మృతిచెందాడు. స్థానిక ఎస్సై వెంకటేశ్వరనాయక్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

# నేడు కంభంలోని పలు ప్రాంతాల్లో పవర్ కట్



**కంభం, మే 14 ప్రభాతవార్త**

కంభం పట్టణంలోని పలు ఏరియాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకట నరసయ్య ఓ ప్రకటన ద్వారా తెలిపారు. లైన్ కన్వర్షన్, ఇన్ లైన్ పోల్స్, తదితర మరమ్మత్తుల కారణంగా కంభం పట్టణంలోని కందులాపురం సెంటర్, పూసలబజార్ ఏరియా ప్రాంతంలో రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు, ప్రజలు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

# మార్కాపురం వార్త



# జేపీ చెరువులో ఘనంగా 16 రోజుల పండుగ



**రాచర్ల, మే 14 ,ప్రభాతవార్త**

మండలంలోని జేపీ చెరువు గ్రామంలో శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి 16 రోజుల పండుగ కార్యక్రమాన్ని గురువారం గ్రామ ప్రజలు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. గత నెల 28వ తేదీన లక్ష్మీ అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి. అలాగే మండలంలోని గౌతవరం గ్రామంలో శ్రీ రంగనాయక స్వామి, శ్రీ లక్ష్మీ, శ్రీ గణపతి, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు పూర్తయి 16 రోజులైన సందర్భంగా గౌతవరంలో కూడా గురువారం 16 రోజుల పండుగ జరిగింది.

# జనగణన ప్రక్రియపై ఎంపీడీఓ తనిఖీ



**రాచర్ల, మే 14 ,ప్రభాతవార్త**

మండలంలోని గౌతవరం, అనుములపల్లి పంచాయతీలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన ప్రక్రియపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ వెంకటరామిరెడ్డి గురువారం నాడు పర్యటించి క్షేత్రస్థాయిలో పురోగతిపై తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన అనేది అత్యంత కీలకమైన ప్రక్రియని ఎటువంటి తప్పులు లేకుండా నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, మండలంలో ఇప్పటివరకు 50 శాతం జనగణన పూర్తయిందని మిగిలిన 50 శాతం కూడా రాబోయే నాలుగైదు రోజుల్లో పూర్తి చేయాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శులు అనిల్‌కుమార్, సురేష్, సచివాలయ సిబ్బంది, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ద్వారా పలు టెక్నీషియన్ కోర్సుల ఉచిత శిక్షణ



**యర్రగొండపాలెం, మే 14, ప్రభాతవార్త**

పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ ద్వారా ఫీల్డ్ టెక్నీషియన్ ఉచిత కంప్యూటరింగ్ అండ్ పెరిఫెరల్స్ కోర్సు నేటి నుండి ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీధర నాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు, మధ్యలో చదువు ఆపివేసిన విద్యార్థులు ఈ కోర్సులో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఈ ఉచిత కోర్సు ద్వారా పొందే గవర్నమెంట్ సర్టిఫికేట్‌అన్ని ఉద్యోగాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. కోర్సులో చేరాలనుకునే విద్యార్థులు వివరాలకు ఫోన్ 9553945387 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# గృహ నిర్మాణాల్లో వేగం పెంచాలి

- ఆగస్టు 15లోపు 3,381 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి
- కలెక్టర్ విజయ సునీత

**మార్కాపురం, మే 14, ప్రభాతవార్త**

జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి ఆగస్టు 15 నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో గృహ నిర్మాణాల పురోగతిపై నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన మొత్తం 3,381 గృహాల నిర్మాణాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి లేఔట్‌లో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణాల కోసం కేటాయించిన లేఔట్లలో తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గతంలో బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిపోయిన గృహాలను గుర్తించి వాటిపై ప్రత్యేక పరిశీలన చేపడతామని, నిర్మాణాలు కొనసాగించని ఇళ్లను రద్దు చేసే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా రుణ సదుపాయాలు కల్పించి నిర్మాణాలను వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం పేదలకు సొంతింటి కల నెరవేర్చే దిశగా కట్టుబడి పనిచేస్తోందని, అధికారులు సమన్వయంతో పనిచేసి గృహ నిర్మాణ లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వి.మోహన్‌రావు, ఈఈ పవన్‌కుమార్, డీఈలు కోటిరెడ్డి, సురేష్‌బాబు, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.





# ప్రజలకు చేరువగా రెవెన్యూ సేవలు

- గ్రామాల్లోనే అర్జీల స్వీకరణ - వేగంగా పరిష్కారం
- తప్పులు లేని రెవెన్యూ రికార్డులే లక్ష్యం
- ఎమ్మెల్యే కందుల





**మార్కాపురం, మే 14, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా, మార్కాపురం మండలం శివరామపురం గ్రామంలో నిర్వహించిన ఒక నెల ఒక గ్రామము నాలుగు సందర్శనలు కార్యక్రమంలో గౌరవ మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలోనే ప్రజల రెవెన్యూ సమస్యలను పరిష్కరించి, రెవెన్యూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ప్రతి నెలలో ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేసి, ప్రతి గురువారం తహసీల్దార్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు గ్రామాలను సందర్శిస్తూ ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామాల్లోనే అర్జీల స్వీకరణ చేపట్టడం ద్వారా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వేగంగా సమస్యల పరిష్కారం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న తప్పులను సరిచేసి పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ గ్రామ ప్రజల నుండి స్వీకరించే ప్రతి అర్జీకి రసీదు అందజేసి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. ఒక నెల వ్యవధిలో గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను తప్పులు లేకుండా సిద్ధం చేసే దిశగా అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాల చెన్నయ్య, సర్వేయర్ సంజీవయ్యతో పాటు ఇతర మండల అధికారులు, గ్రామ అధికారులు పాల్గొన్నారు.

# కూటమి వేదింపులపై జగన్‌ను కలిసిన దద్దాల



**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ పై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తోందని కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో గురువారం తాడేపల్లిక్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పోలీసు కేసులు, సోషల్ మీడియా కార్యకర్తలపై జరుగుతున్న చర్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు దద్దాల తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకొని వేదింపులకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దీనిపై స్పందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ఎవరు భయపడాల్సిన అవసరం లేదు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్లు సమాచారం. కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న వారిపై పార్టీ పూర్తి స్థాయిలో నిఘా ఉంచిందని, ప్రతిఅంశాన్ని గమనిస్తున్నామని జగన్ పేర్కొన్నట్లు తెలిపారు. పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలని, వైఎస్సార్‌సీపీ నాయకత్వం వారికి అండగా నిలుస్తుందని జగన్ స్పష్టం చేసినట్లు దద్దాల వెల్లడించారు.

# వేములకోటలో వార్షిక రుణ జీవనోపాధుల సర్వే పరిశీలన

- గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
- డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శివన్నారాయణ





**మార్కాపురం, మే 14, ప్రభాతవార్త**

మార్కాపురం మండలం వేములకోట గ్రామంలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నవార్షిక రుణ జీవనోపాధుల సర్వే (ఏసీఎల్‌పి) కార్యక్రమాన్ని డీఆర్‌డీఏప్రాజెక్ట్ డైరెక్టర్ పరిశీలించారు. గ్రామీణ మహిళా సంఘాల ఆర్థిక స్థితిగతులు, జీవనోపాధి అవకాశాలు, స్వయం ఉపాధి పురోగతి, రుణాల వినియోగం వంటి అంశాలపై జరుగుతున్న సర్వే ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ సంఘ సభ్యులు, వీవోలు, సీసీలు అందిస్తున్న వివరాలను తెలుసుకుని సర్వేను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన ఆదాయం, ఉపాధి వనరులు, అప్పుల పరిస్థితి, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి వంటి వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని తెలిపారు. గ్రామీణ పేద కుటుంబాల అసలు అవసరాలను గుర్తించి, వారికి అనుగుణంగా జీవనోపాధి ప్రణాళికలు రూపొందించేందుకు ఏసీఎల్ పి సర్వే ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, ఆదాయ వనరుల పెంపు కోసం డీఆర్‌డీఏ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం మహిళా సంఘ సభ్యులతో సమావేశమై పొదుపు అలవాట్లు, రుణాల సక్రమ వినియోగం, చిన్న వ్యాపారాల అభివృద్ధి, కుటుంబ ఆర్థిక ప్రణాళిక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థంగా వినియోగించుకుని ఆర్థికంగా మరింత పురోగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఓ పిచ్చయ్య, మండల సమాఖ్య ప్రతినిధులు, గ్రామ సంఘ నాయకులు, వీవోలు, సీసీలు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించుటలో కూటమి ప్రభుత్వం విఫలం

- ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించాలి
- పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, అన్నా రాంబాబులు డిమాండ్



**కొనకనమిట్ల, మే 14, ప్రభాతవార్త**

పొగాకురైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఉమ్మడి ప్రకాశంజిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. గురువారం పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ధరలు దిగజారి పోయాయని, వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు పొగాకును కొనుగోలు చేస్తూ రైతును నష్టపరుస్తున్నారన్నారు. ప్రభుత్వం 500 కోట్లు కేటాయించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు తగ్గినప్పుడు తక్షణమే ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారాకొనుగోళ్లు జరిపి రైతును ఆదుకుందని గుర్తు చేశారు. సిండికేట్‌గా మారుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం ఆపదని, ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి, కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, యక్కటి శేషగిరిరావు, ఉన్నం శ్రీనివాసులు,కృష్ణారెడ్డి, ఫిరోజ్, రైతులు పాల్గొన్నారు.

# బధిర విద్యార్థులకు సువర్ణావకాశం

**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**

ఒంగోలులో ఆధునిక వసతులతో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వృద్దుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహిస్తున్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో బధిర విద్యార్థులకు ఆధునిక విద్య వసతులతో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమజ తెలిపారు. చెవిటి, మూగ విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన అందించేందుకు పాఠశాలలో డిజిటల్ క్లాసులు, కంప్యూటర్ ల్యాబ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలురు, బాలికలకు వేర్వేరు హాస్టల్ వసతులు కల్పించడంతో పాటు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ సదుపాయాలు కూడా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో చేరేందుకు కనీస వయసు 6 నుంచి 8 సంవత్సరాల మధ్య ఉండాలని, బదిలీ సర్టిఫికేట్ ఆధారంగా ఇతర తరగతుల్లోనూ ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో బధిర విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ప్రిన్సిపాల్ ప్రేమజ విజ్ఞప్తి చేశారు. పాఠశాల చిరునామా.. ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాల, భాగ్యనగర్ 4వ లైన్, 11వ వార్డు రోడ్, డీఆర్‌డీఏ వెలుగు కాంప్లెక్స్, ఒంగోలు. 9000872305, 9490726636 నంబర్లను సంప్రదించాలన్నారు.

## సింగరాయకొండ ఎస్‌ఐగా ఎల్.సుధీర్‌కుమార్ బాధ్యతలు



**సింగరాయకొండ,మే 14, ప్రభాతవార్త**

సింగరాయకొండ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా లేళ్ల సుధీర్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయనకు స్థానిక పోలీసు సిబ్బంది స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజా పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపడతామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని కోరారు.

8:8.qxd 5/15/2026 12:13 AM Page 1



## ఆకలితో అలమటిస్తున్న కుటుంబానికి స్నేహహస్తం అండ

**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**



కనిగిరిలో మానవత్వాన్ని చాటి హృదయాన్ని కదిలించే ఘటన చోటు చేసుకుంది. తల్లికి మతిస్థిమితం సరిగా లేక రోడ్ల వెంట బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద కుటుంబం తిండికి ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సుధీర్‌బాబు వెంటనే స్పందించి ఆ కుటుంబానికి చేయూత అందించారు. గురువారం ట్రస్టు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు బియ్యం, చీరలు, కూరగాయలు, కిశోర బాలికలకు అవసరమైన పౌష్టికాహారం తదితర నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. సహాయం అందుకున్న కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించాలని కోరారు. మన చుట్టూ ఇబ్బందుల్లో ఉన్న వారిని గుర్తించి చేతనైన సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. స్నేహహస్తం ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

## 7వ తెలుగు ప్రపంచ సాహిత్య మహాసభల కార్యదర్శిగా కాకర్ల రమణయ్య

### - గుడిపాటిపల్లెకు దక్కిన గౌరవం

**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**



తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య ప్రోత్సాహానికి కృషి చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7వ తెలుగు ప్రపంచ సాహిత్య మహాసభలకు కనిగిరి నియోజకవర్గం వెలిగండ్ల మండల గుడిపాటిపల్లెకు చెందిన సాహిత్యాభిమాని కాకర్ల రమణయ్యను కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరి భూషణం, జాతీయ ప్రణాళిక అధికారి టి. పార్థసారధి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్నిఅందుకున్నారు. తెలుగు భాష పరిరక్షణ, సాహిత్య వికాసం, రచయితల ప్రోత్సాహ కార్యక్రమాల్లో రమణయ్య చురుకుగా పాల్గొంటూ ప్రత్యేక గుర్తింపు పొందినట్లు కళావేదిక ప్రతినిధులు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 6,7వ తేదీల్లో రాజమహేంద్రవరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఈ మహాసభలు వైభవంగా నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి తెలుగు కవులు, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొననున్న ఈ మహాసభలు తెలుగు సంస్కృతి, సాహిత్య వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యదర్శిగా నియమితులైన రమణయ్య మాట్లాడుతూ తెలుగు భాషకు సేవ చేసే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. మహాసభలను విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సాహిత్యాభిమానులు, మిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## తమ్మినేని శ్రీనివాసులరెడ్డికి ఘన నివాళి

### - దశదిన కర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర, పలువురు ప్రముఖులు

**కనిగిరి, మే 14, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోని కొత్తూరులో హనుమాన్ జుబ్లీహిల్స్‌లోని స్వగృహంలో కనిగిరి టౌన్ మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి దశదిన కర్మ కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరై తమ్మినేని శ్రీనివాసులరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీనాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు. మృతుని కుటుంబ సభ్యులైన తమ్మినేని సాయి నీలేష్‌రెడ్డి, తమ్మినేని నిరంజన్‌రెడ్డిని పలువురు పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ తెలుగుదేశంపార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి సోదరులు, తమ్మినేని సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు ఉపవిద్యాశాఖ అధికారి చంద్రమోళీశ్వర్‌కు ఘన సన్మానం

**మార్కాపురం, మే 14 ప్రభాతవార్త**





స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా ఒంగోలు డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి అంపేరాయని చంద్రమోళీశ్వర్‌పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని మార్కాపురం జిల్లా మండల విద్యాశాఖాధికారులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంయుక్తంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్కాపురం డివిజనల్ ఉపవిద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ గణిత మేధస్సుతో ఉపాధ్యాయునిగా సేవలను ప్రారంభించిన చంద్రమోళీశ్వర్ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. అనంతరం మండల విద్యాశాఖాధికారిగా, ఉపవిద్యాశాఖ అధికారిగా వివిధ హోదాల్లో ఉత్తమ సేవలు అందిస్తూ అందరి ఆదరాభిమానాలు పొందారని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు సమాజ నిర్మాణంలో ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. సన్మాన గ్రహీత అంపేరాయని చంద్రమోళీశ్వర్ మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలో మార్కాపురం డివిజన్ ప్రత్యేక గుర్తింపు, సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఇక్కడి ప్రజలు, ఉపాధ్యాయులు ఎంతో మంచి మనసుతో బాధ్యతగా పనిచేస్తారని పేర్కొన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విశ్రాంత ఉపవిద్యాశాఖ అధికారి చంద్రమోళీశ్వర్ దంపతులను దుశ్శాలువలు, జ్ఞాపికలతో వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపవిద్యాశాఖ అధికారి వైఎ అమరేశ్వర్, మండల విద్యాశాఖాధికారి బి రాందాస్ నాయక్, మండల విద్యాశాఖాధికారుల సంఘం అధ్యక్షులు డి రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి గిరిధర్ శర్మ, ప్రధానోపాధ్యాయుల సంఘ నాయకులు ముత్తోజు సుధాకర్, ఎం విజయభాస్కర్ రెడ్డి, వేమూరి పిచ్చిరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఓవి వీరారెడ్డి, కె ఎర్రయ్య, వెన్న వెంకటరెడ్డి, ఎం రవిచంద్ర, జిఎల్ రమేష్, సంజీవ్, ఎన్జీవో నాయకులు రమేష్ రెడ్డి, సంజయ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కాపురం జిల్లా పరిధిలోని అన్ని మండలాల మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య - ఎంఈఓ

**మార్టూరు, మే 14, ప్రభాతవార్త**

మండలంలోని రాజుగారిపాలెం, చిమ్మిరిబండ, తాటివారిపాలెం గ్రామాల పరిధిలోను మార్టూరు గ్రామంలోని అంబేద్కర్ నగర్, విజయ నగర కాలనీలలోని 5 ప్లస్ ఏజ్ పిల్లలు, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లేటువంటి విద్యార్థులను ఒకటో తరగతి, ఇతర తరగతులలో అడ్మిషన్స్ పొందే నిమిత్తం మండల విద్యాశాఖ అధికారులు ఎంసీహెచ్ వస్త్రామ్ నాయక్, కే. ప్రేమలత, ద్రోణాదుల బొబ్బేపల్లి, కోలలపూడి, మార్టూరు, చిమ్మిరిబండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. పోతురాజు, బి. చలపతి, కే. కృష్ణ ప్రసాద్, రూత్ మెర్సి, కే. నాగేశ్వరరావు, ప్రభుత్వ పాఠశాలలో పెంపుదల కొరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ఫౌండేషన్, బేసిక్, మోడల్ పాఠశాలలుగా రూపొందించి, ఉత్తమ విద్యను అందించడానికి ప్రతి తరగతి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించి మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు కూడా అందుకు అవసరమైన టెక్నాలజీని ఉపయోగించుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకొని విద్యను బోధించుచున్నందున ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న ఉచిత సౌకర్యాలను వినియోగించుకుని, శిక్షణ పొంది అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబుద్ధులు నేర్పించాలని, విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్య, నైపుణ్యాలను నేర్పించే బాధ్యత మా ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు తీసుకొని విద్యాబోధన చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసాని కల్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పి. పణి పద్మకుమారి శంకరరావు, మోహన్‌రావు, మేరీ జోన్స్, మాధవి, జే. కోటేశ్వరరావు, తిరుమలేశ్వరరావు, డి. రవీంద్ర, శంకరరావు, వై. ఏడుకొండలు లక్ష్మీకాంత్, బి. శ్రీనివాస్, రామదాసు, సీఆర్పీలు జి. రమేష్, పి. శ్రీనివాసరావు, ఎస్. రామారావు పాల్గొన్నారు.



## ఓల్టేజీ సమస్యలపై దృష్టి సారించాలి

**వెలిగండ్ల, మే 14, ప్రభాతవార్త**

ఓల్టేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కనిగిరి ఈఈ ఉమాకాంత్, పామూరు డీఈఈ కృష్ణారెడ్డిలు సూచించారు. శుక్రవారం వెలిగండ్ల సెక్షన్‌లోని సిబ్బందితో కనిగిరి ఈఈ, పామూరు డీఈఈలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలతో మమేకమవుతూ వారికి సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా ఓల్టేజీ సమస్య ఉంటే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులతో మర్యాద పూర్వకంగా మసులు కోవాలన్నారు. అనంతరం ఎమ్మార్వో ఆఫీసు పక్కన కొత్త ట్రాన్స్‌ఫార్ను ఏర్పాటుచేయడంజరిగింది. ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వల్ల గవర్నమెంట్ఆఫీసులన్నింటికి ఉపయోగకర మన్నారు.



## సింగరకొండలో ఘనంగా ముగిసిన హనుమత్ జయంతి ఉత్సవాలు

### - పుష్పాయాగం, అష్టోత్తర శతకలశాభిషేకం









**అద్దంకి, మే 14, ప్రభాతవార్త**

హనుమత్ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం అత్యంత ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్వామి వారికి అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. పూర్ణాహుతి, అవబృద్ధం, కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి పుష్పాయాగం, అత్యంత వైభవంగా నిర్వహించారు. రథోత్సవం కూడ కనులపండుగగా సాగింది. ఆయా కార్యక్రమంలో ఎసి తిమ్మానాయుడు, పాలక మండలి చైర్మన్ చుండూరీ మురళీ సుధాకరరావు, డైరెక్టర్లు, అద్దంకి పట్టణ టిడిపి నాయకులు గార్లపాటి శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సీమంతాలు

**అద్దంకి, మే 14, ప్రభాతవార్త**





రోటరీ క్లబ్ సింగరకొండ ఆధ్వర్యంలో, గురువారం శ్రీ వెంకటేశ్వర ఆర్యవైశ్య కళ్యాణ మండపం గీతా మందిరంలోసీనియర్ రొటేరియన్ శ్రీప్రసన్నాంజనేయ దేవస్థానం మాజీ ఛైర్మెన్ కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి దంపతుల సౌజన్యముతో, 15 మంది పేద గర్భిణీ స్త్రీలకుచీర, పసుపు, కుంకుమ, పండ్లు, స్వీట్స్ పంచి సంప్రదాయపద్ధతిలో సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, కార్యదర్శి అళహరిహరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, నరసింహారావు, చప్పిడి వీరయ్య, అద్దంకి లేవి ప్రసాద్, పువ్వాడ రామకోటేశ్వరావు, సంకాబాబు, పసుపులేటి ఆంజనేయులు, ఊటుకూరు రామకోటేశ్వరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, కొల్లా భువనేశ్వరి, అంజాద్ భాష, లక్ష్మీ రెడ్డి, చిన్ని కామేశ్వరావు, ఈటీఎల్ శ్రీనివాసాయ, డాక్టర్ కాజవలి, అంగన్వాడీ సూపర్వైజర్స్ జయప్రద, ఇందిర, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోట శ్రీనివాస్ కుమార్ సతీమణి నాగలక్ష్మిని ఘనంగా సత్కరించారు.

## నేల ఆరోగ్యం బాగుపడాలంటే నవ ధాన్యాల సాగు చేపట్టాలి

**అద్దంకి, మే 14, ప్రభాతవార్త**





నేల ఆరోగ్యం బాగుపడాలంటే నవ ధాన్యాల సాగు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. ఏపీ. సి. ఎన్. ఎఫ్ ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకులకు మరియు క్షేత్ర సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమం లో భాగం గా చినకొత్తపల్లి గ్రామం లో నిర్వహించిన కార్యక్రమం లో భాగమా గా మొదటి గా పి. ఎం. డి. ఎస్ కిట్లు ద్వారా సాగు చేసిన క్షేత్రం ను పరిశీలించారు. పి. ఎం. డి. ఎస్ కిట్లు ద్వారా 18 నుండి 31 రకాల విత్తనాలు రైతులకు అందిస్తున్నామని భూములు ఖాళీగా ఉంచకుండా ఇవి సాగు చేసుకోవాలని సూచించారు. వీటి సాగు ద్వారా భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు, బాక్టీరియా, పెంపోంది భూసారం పెరుగు తుందని సూచించారు. ఈ విత్తనాలు సాగు చేయడం వలన 30 నుండి 35టన్నుల పచ్చిరొట్ట ఎరువు తయారు అవుతుందని ఆయన తెలిపారు. మాస్టార్ ట్రైనర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ మన పిల్లల ఆరోగ్యం బాగువుండాలంటే పకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు నరిశెట్టి రమేష్ బాబు, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, రేణుక, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## చలివేంద్రంలో 34వ రోజు సేవా కార్యక్రమం

### - అల్పాహారం, మజ్జిగ పంపిణీ

**అద్దంకి, మే 14, ప్రభాతవార్త**









అద్దంకి పట్టణంలోని మాజీ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సేవా కార్యక్రమాలు 34వ రోజు కొనసాగాయి. అందులోభాగంగా 19వ వార్డుకు చెందిన చిట్యాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిట్యాల సుబ్బారావు జ్ఞాపార్థం అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. అల్పాహారంగా పులిహోర, కేసరి, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నేడు సంతమాగులూరులో మంత్రి గొట్టిపాటి పర్యటన

**సంతమాగులూరు, మే 14, ప్రభాతవార్త**



విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మండల కేంద్రమైన సంతమాగులూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ పి. రాజబాబు అధ్యక్షతన నిర్వహించు మీకోసం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న మీకోసం"కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు హాజరై, తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించు కోవాలని ఏఎంసి చైర్మన్ తేల్రపోలు రమేష్, మండల టిడిపి అధ్యక్షుడు చేవూరు వాసిరెడ్డి తెలిపారు.

## సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలి

**దర్శి, మే 14, ప్రభాతవార్త**



వరి, మొక్కజొన్న, మిరప, పొగాకు పంటల రసాయనిక ఎరువులను తగ్గించి జీవన, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి. వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బొట్లపాలెం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం దర్శి వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. మన నేలల్లో సేంద్రియ కర్బన శాతం చాలా తక్కువగా ఉంటుందన్నారు. దిగుబడులు భాగా రావడానికి మన రైతులు ఎక్కువగా రసాయనిక ఎరువులను కాంప్లెక్స్ రూపంలో వాడుతున్నారు. దీని వలన భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి భూమి లోపల ఉన్న పోషకాలు మొక్కకు అందుబాటులోనికి తీసుకొస్తాయని తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడానికి ప్రత్యామ్నాయ ఎరువులైన జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులు, వానపాము ఎరువులను, మేకలు, గొర్రెల ఎరువులను వాడుకోవాలని తెలియజేశారు. అలాగే రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దర్శి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాధ, గ్రామ పెద్దలు, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

## జనగణన పరిశీలించిన ఛార్జ్ ఆఫీసర్ రజనీకుమారి

**ముండ్లమూరు, మే 14, ప్రభాతవార్త**



మండలంలోని శంకరాపురం హెచ్ఎల్బీబీ నెంబర్ 108 వేంపాడు, హెచ్ఎల్బీ నెంబర్ 95 జరుగుతున్న జనగణన పరిశీలించిన ఛార్జ్ ఆఫీసర్ ముండ్లమూరు తహసీల్దార్ రజనీ కుమారి. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. జనగణన పకడ్బందీగా నిర్వహించాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలనిఆమె సూచించారు. ఎలాంటి తప్పులు సవరణలు లేకుండా అధికారులు పని చేయాలని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాలెండర్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలి

### - ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ పిడి ఎం. నాగమణి

**కొరిసపాడు, మే 14, ప్రభాతవార్త**



కిశోర వికాసం వరకు ప్రభుత్వం రూపొందించిన సమ్మర్ క్యాలండర్ 2026 ప్రణాళికలను పకడ్బందీగా నిర్వహించాలని ఐ సి డి ఎస్, పిడి, ఎం. నాగమణి సిబ్బందికి తెలియజేశారు. గురువారం ఆమె కొరిసపాడు మండల సమావేశ హాలులో కిశోరి వికాస మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిడితోపాటు తహసీల్దార్ జి వి సుబ్బారెడ్డి కూడా పాల్గొన్నారు. సమావేశంలో వారు మాట్లాడుతూ కిశోర బాల బాలికల సాధికారతకై ప్రభుత్వం వేసవి సెలవులు శిక్షణా కార్యక్ర మాలు మే ఒకటి నుంచి జూన్ 9 వరకు వివిధకార్యక్రమా లను రూపొందించి సమ్మర్ క్యాలెండరు ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికి కిశోర వికాసంకై కొన్ని కార్యక్రమాలు జరిగాయన్నారు. శుక్రవారం జరుగునున్న కార్యక్రమంలో హెచ్ఐవి వ్యాధిగురించి అవగాహన కల్పించి ఆ వ్యాధి అంటకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి కూడా తెలియజేయాలన్నారు. అలాగే చివరి రోజు అయిన జూన్ 9న పిల్లల గ్రామసభ నిర్వహించాలన్నారు. ఇలా క్యాలెండర్ లోని అన్ని షెడ్యూల్స్ ను ప్రణాళికాబద్ధంగా నిబద్ధతతో పూర్తిచేసి సమ్మర్ క్యాలండర్ 2026 ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు కొరిసపాడు మండల ఏవో శోభారాణి, వెలుగు ఏపిఎం మాణిక్యరావు, ఐ సి డి ఎస్ మేదరమెట్ల సూపర్వైజర్ అరుణా దేవిలతో పాటు కిశోరి వికాసం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం రమేష్

**సంతమాగులూరు, మే 14, ప్రభాతవార్త**



అద్దంకి నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు పూనూరి రమేష్ చూపిన నిజాయితీ అందరికీ ఆదర్శంగా నిలిచింది. నరసరావుపేట నుంచి అద్దంకి వస్తున్న సమయంలో సంతమాగులూరు రోడ్డుపై ఒక పర్సు కనిపించగా, అందులో రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఏటీఎం కార్డులు సహా ముఖ్యమైన పత్రాలు ఉన్నాయని గుర్తించిన రమేష్ వెంటనే దాన్ని సురక్షితంగా సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కొద్దిసేపటికే పర్సు పోగొట్టుకున్న వ్యక్తులు పోలీసులను సంప్రదించగా, స్టేషన్‌కు రావాలని సూచించారు. అనంతరం వారు అక్కడికి చేరుకుని తమ పర్సు ను తిరిగి స్వీకరించారు. పునూరి రమేష్ ప్రదర్శించిన ఈ నిజాయితీ, బాధ్యతాయుతమైన వ్యవహారంపై స్థానిక ప్రజలు, పోలీస్ అధికారులు రమేష్‌ను ప్రశంశించారు.

## క్రైస్తవ ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ఉద్యమాలే మార్గం



**సంతమాగులూరు, మే 14, ప్రభాతవార్త**

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ఇతర పేద వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమ బాట పట్టినప్పుడే తమ రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడం సాధ్యమవుతుందని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి, ప్రకాశం జిల్లా కార్యదర్శి దుడ్డు వెంకటరావు పేర్కొన్నారు. క్రైస్తవ మతం స్వీకరించిన ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తించదన్న సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ గురువారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెంలోని హిందూ ప్రాథమికోన్నత పాఠశాలలో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేవీన్ పి యస్ జిల్లా అధ్యక్షుడు ఒర్సు శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, పలువురు మాట్లాడుతూ దేశంలో మతతత్వ రాజకీయాల ప్రభావం పెరుగుతోందని, దళితులు, గిరిజనులు, ముస్లింలు, క్రైస్తవ మైనారిటీల హక్కులను బలహీనపరిచే విధంగా పాలన సాగుతోందని ఆరోపించారు. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం, సమానత్వ హక్కులను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని, ఇప్పటికే కార్మిక చట్టాలు సహా పేదల హక్కులకు భంగం కలిగించే అనేక నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. క్రైస్తవ మతం స్వీకరించినంత మాత్రాన దళితులపై సామాజిక వివక్ష తొలగిపోదని, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ వారు వివక్ష, దాడులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ అట్రాసిటీ చట్టం వర్తించదన్న తీర్పు బలహీన వర్గాల భద్రతకు ప్రమాదకరమని అన్నారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ భావజాలం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతోందని, మైనారిటీల ఓటు హక్కులను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ వంటి అంశాలపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రజలు చైతన్యవంతులై భావ స్వేచ్ఛ, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పేదలు డబ్బుకు ఓటు అమ్ముకోవడం వల్లే రాజకీయ నాయకులు వారిపై ఆధిపత్యం కొనసాగిస్తున్నారని, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైన ఆయుధమని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. ఈ సమావేశంలో మండలంలోని 20 గ్రామాలకు చెందిన పాస్టర్లు సామాజిక కార్యకర్తలు, దళిత సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు సంతమాగులూరులో ప్రజాదర్బార్

### - మంత్రి గొట్టిపాటి, జిల్లా కలెక్టర్ హాజరు - సాయంత్రం సజ్జాపురంలో పల్లెనిద్ర

**సంతమాగులూరు, మే 14, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన సంతమాగులూరులో నేడు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించ నున్న ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక పల్లెనిద్ర కార్యక్రమం ఏర్పాట్లను అధికారులు గురువారం పరిశీలించారు. కార్యక్రమం నిర్వహణకు సంబంధించి అందిన సమాచారంతో అద్దంకి ఆర్డిఓ జాన్సన్, సంతమాగులూరులో మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక స్థలాన్ని పరిశీలించారు. సంతమాగులూరు మండలంలో కలెక్టర్ రాజాబాబుతో సహా జిల్లా యంత్రాంగం మండలంలో నేడు అందుబాటులో ఉంటారని తహసీల్దార్ కే. రవిబాబు, ఎంపీడీవో గద్దల జ్యోతిర్మయి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెలియజేయవచ్చన్నారు. వెంటనే సమస్యల పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

